## ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తరలిన రైతులు



ప్రాజెక్టు ప్రారంభోత్స వానికి తరలివెళుతున్న దృశ్యం

**న్యాల్‌కల్, జూన్ 7, ప్రభాతవార్త:** చిన్న చల్మడలో బుధవారం మంత్రి హరీష్‌రావు ప్రారంభించనున్న సంగమేశ్వర ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, రైతులు బుధవారం ఉదయం తరలివెళ్లారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన 6 బస్సుల్లో ఏఈఓల ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అదికారి నేతృత్వంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. మండలంలోని మల్గినుంచి గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌లు ఫోరం ఉపాధ్యక్షులు మరుతి యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ ఎంటిటిసి రైతులు తరలివెళ్లారు.




## మర్కుక్‌లో పర్యటించిన కేంద్ర జలశక్తి అభియాన్ అధికారులు



పల్లె ప్రకృతివనంను పరిశీలిస్తున్న అధికారులు

**మర్కుక్, జూన్ 7 (ప్రభాతవార్త):** మర్కుక్ మండల కేంద్రంతో పాటు పాతూరు, ఇప్పలగూడెం, ఎర్రవల్లి గ్రామాల్లో బుధవారం కేంద్ర జలశక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ వేదవీర్ ఆర్య, టెక్నికల్ ఆఫీసర్ టి.మాధవ్‌లు సిద్దిపేట జిల్లా అడీషనల్ డిఆర్‌డిఓ కౌసల్యాదేవితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పాతూరు గ్రామపంచాయతీలో రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఇప్పలగూడెంలో కెనాల్ బండ్ ప్లాంటేషన్, మర్కుక్‌లో నర్సరీ, కమ్యూనిటీ ప్లాంటేషన్, పిపివి, బిపివి మరియు ఎర్రవల్లిలో ఆయిల్‌ఫామ్ మొదలగు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిడి ఓబులేష్, సతీష్, ఎంపిడిఓ ప్రవీణ్, ఈసీ రాజు, హార్టికల్చర్ అధికారి, టిఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పత్రాలను అందజేస్తున్న ఆర్థిక మంత్రి హరీష్‌రావు

## దరిద్రాన్ని దూరం చేసిన ధరణి పోర్టల్

### -ఆర్థిక మంత్రి తన్నీరు హరీషరావు

**సదాశివపేట, జూన్ 7, ప్రభాతవార్త:** భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఎదుర్కొన్న ఎడబాటును ధరణి పోర్టల్‌తో దరిద్రం దూరమయిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని తహసీల్‌దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి పోర్టల్ పనితీరును పరిశీలించారు. ఈ సంరద్భంగా ధరణి పోర్టల్‌పై రైతులతో మంత్రి హరీష్‌రావు ముఖాముఖి నిర్వహించారు. తహసీల్దార్ అందిస్తున్న సేవలను, అంకితబావంతో విధులు నిర్వహిస్తున్న ట్లు రైతులు మంత్రి దృష్టికి తేగా మంత్రి హరీష్‌రావు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి హరష్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో రిజిస్ట్రేషన్‌ల కోసం ప్రజలు పడరాని పాటుల పడ్డ విషయాన్ని గుర్తు చేస్తూ నేడు ధరణితో సమస్యలు మటుమాయం అయ్యాయన్నారు. భూముల అమ్మకాలు, కొనుగోళ్లు సునాయాసంగా, పారదర్శకంగా, త్వరిత గతిన 15 నిమిషాల్లో పూర్తవుతున్నట్లు గుర్తు చేశారు. ధరణిని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్వయంగా రూపొందించినట్లు పేర్కొన్నారు. బుధవారం రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లను మంత్రి రైతులక అందచేశారు. రాష్ట్ర చేనేత సహకార సంఘం అభివృద్ధి చైర్మన్ చింత ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఈనెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** వెనకబడిన వర్గాలకు చెందిన కులవృత్తులకు, చేతివృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న లక్ష రూపాయాల అర్థిక సహాయం కోసం ఈనెల 20లోపు అన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ సూచించారు. బుధవారం అయన మాట్లాడుతూ రజక, నాయిబ్రాహ్మణ, మేదరి, వడ్డెర, గౌడ్స్, కుమ్మరి శాలివాహన, పూసల, బట్రాజ, విశ్వబ్రాహ్మణ, సాగర ఉప్పర, వాల్మీకిబోయలు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18 యేండ్లు నిండి 55 యేండ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. కుల, అదాయ ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరం అదాయం రూ.1,50,000 పట్టణ వాసులకు రూ. 2,00,000లకు లోబడిన వారు అర్హులన్నారు. కుల వృత్తి చేసుకునే కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రూ. లక్ష అర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. గత 5 యేండ్లలోపు ఏ ప్రభుత్వ శాఖా ద్వారా అయిన అర్థిక లబ్ధిపొందిన వారు 2017-18లో రూ. 50,000 లబ్ధిపొందిన వారు అర్హులు కాదన్నారు. అన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత అట్టి దరఖాస్తును కుల ధృవీకరణ, అదాయ, అధార్ కార్డు, అహార భద్రత కార్డు(రేషన్ కార్డు), పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, బ్యాంకు ఖాతా బుక్‌ను జత పరిచి మండల పరిషత్ కార్యాలయంలో, పట్టణ వాసులు మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

## సీఎం కేసీఆర్ నాయకత్వంలో చెరువులకు జలకళ

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



బతుకమ్మలతో చెరువు కట్టపై ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు

**పటాన్‌చెరువు, జూన్ 7, ప్రభాతవార్త:** అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సాగునీటి రంగంలో చేపడుతున్న సంస్కరణ మూలంగా మండు వేసవిలోనూ చెరువులు అలుగులను దూకుతున్నాయని, ప్రతి రైతు పుష్కలంగా పంటలు పండించుకుంటున్నారని పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 6వ రోజైన బుధవారం పటాన్‌చెరువు పట్టణంలోని సాకి చెరువు కట్టపైన నిర్వహించిన సాగునీటి దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోలాటాలు, బతుకమ్మలతో ఎమ్మెల్యే జీఎంఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం సాగునీటి రంగంలో చేపట్టిన అభివృద్ధి నివేదికను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకతీయుల కాలంలో చెరువులను పునరుద్దరించి పూడికలను తీస్తే తిరిగి ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులకు పునరుద్దరణ జీవం తీసుకుని వచ్చారన్నారు. దీని మూలంగా చెరువులు నిండుకుండలా మారి ఆయకట్టు విస్తీర్ణం పెరిగి అంచనాలకు మించి పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఒకవైపు సాగునీరు, మరోవైపు 24 గంటల విద్యుత్, మద్దతు ధర అందించడం మూలంగా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటిసి సుప్రజా వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్, చెరువుల విభాగం సూపరిండెంట్ ఇంజనీర్ ఆనంద్, ఇరిగేషన్ డీఈ రామస్వామి, నళిని, ఆయా మండలాల ఎంపిడిఓలు, వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి శ్రీకారం



భూమిపూజ చేస్తున్న మంత్రి హరీష్‌రావు

## పథకానికి భూమిపూజ చేసిన మంత్రి హరీష్‌రావు

**మునిపల్లి, జూన్ 7, ప్రభాతవార్త:** గోదావరి నీటితో సంవత్సరానికి రెండు పంటలు పండి పొలాలు సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసిఆర్ సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మండలంలోని చిన్న చెల్మెడ గ్రామం వద్ద భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చి 9 సంవత్సరాలు పూర్తి అయినందున సిఎం కేసిఆర్ సూచన మేరకు రాష్ట్రమంతా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా తొమ్మిది సంవత్సరాలలో సాధించిన విజయాలపై ప్రత్యేకంగా ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించి, సంబంధిత అధికారులను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో సిఎం కెసిఆర్‌కు అండగా ఉంటూ నిరంతరం పర్యవేక్షిస్తానని అన్నారు. ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న రైతులకు అధిక మొత్తంలో నష్టపరిహారం అందించాలని మంత్రి గారిని కోరారు. ఎమ్మెల్యే కోరిక మేరకు వారికి అధిక మొత్తంలో నష్టపరిహారం అందించేలా చూస్తానని మంత్రి హరీష్‌రావు అన్నారు. సుమారు రూ.2,400 కోట్లతో ప్రారంభిస్తున్న ఈ సంగమేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా అందోల్, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరువుల పరిధిలో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి బీబీ పాటిల్, జెడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ, సిడిసి చైర్మన్ చింత ప్రభాకర్, మునిపల్లి జెడ్పీటిసి మీనాక్షి, ఎంపి శైలజ, రాయికోడ్, ఎంపిపి జడ్పీటిసిలు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మునిపల్లి టిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి మంతూరి శశికుమార్, చిన్న చల్మెడ గ్రామ సర్పంచ్ విజయభాస్కర్ మునిపల్లి రాయికోడ్ మండలాల సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

## ఐటీ టవరులో ప్రముఖ ఐటీ కంపెనీలు భాగస్వామ్యం కావడం హర్షనీయం

### జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిఎం కెసిఆర్, ఐటీ శాఖ, అర్థిక శాఖ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావుల అలోచన మేరకు సిద్దిపేట జిల్లాలో నిర్మించిన ఐటీ టవరులో ప్రముఖ ఐటీ కంపెనీలు భాగస్వామ్యం కావడంతో సంతోషకరంగా ఉందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం అయన ప్రముఖ ఐటీ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఐటీ టవర్ ప్రారంభం ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఓఎస్ఐ డిజిటల్, జోలాన్ టెక్, విసన్ ఇన్ఫోటెక్, అమిడాయ్ ఎడ్యుటెక్, ఫిక్సిటీ టెక్నాలజీస్, ఇన్ఫోసోల్, థోరాన్ టెక్నాలజీస్, బీసీడీసీ క్లౌడ్ సెంటర్స్, ర్యాంకు ఐటీ, సర్వీసెస్ తదితర కంపెనీలు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు అయా కంపెనీల ప్రతినిధులు వివరించినట్లు కలెక్టర్ తెలిపారు. హైదారాబాద్ నుంచి అతీ సమీపంలో ఉన్న సిద్దిపేట ఐటీ టవర్ అహ్లాదకరమైన వాతావరణంలో, రాజీవ్ రహదారిపై ఉన్నదని సమీపంలోనే త్రీస్టార్ హోటల్, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, పోలీసు కమిషనరేట్ ఉండడంతో పటిష్టమైన శాంతి భద్రతల నిర్వహణ వలన ఎలాంటి సమస్యలు లేకుండా ఉంటాయన్నారు. తమతో కలిసి వచ్చే కంపెనీలకు ఎలాంటి రాయితీలు కావాలన్నా ఇచ్చేందుకు ప్రభుత్వ పరంగా సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు స్థానికంగా ఐటీ ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు రావాలని అయన కంపెనీ ప్రతినిధులకు పిలుపునిచ్చారు. సమీక్షలో ఐటీ కంపెనీల ప్రతినిధులు, సిద్దిపేట ఐటీ టవర్ నిర్వాహకులు చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి రంగంలో రాష్ట్రం నంబర్‌వన్

### జెడ్పి చైర్మన్ రోజారాధాకృష్ణశర్మ

**గజ్వేల్, జూన్ 7 (ప్రభాతవార్త):** సాగునీటి రంగంలో తెలంగాణ రాష్ట్రం నెం.1గా ఉందని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ రోజారాధాకృష్ణశర్మ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాగునీటి దినుత్సోవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ రోజారాధాకృష్ణశర్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నీళ్ళు, నిధులు, నియామకాలు అనే నినాదంతో ఉద్యమం కొనసాగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ సారథ్యంలో నీళ్ళు, నిధులు, నియామకాలు దేశంలో ఎక్కడా లేనివిధంగా చేపట్టారన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సాగునీటి దినోత్సవం జరుపుకోవడం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమైందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో అత్యధికంగా వరిధాన్యం పండించినట్లు పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్మాణం కొరకు భూసేకరణ చేస్తే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ భూములు అమ్ముకుంటారని ఇష్టంవచ్చినట్లు మాట్లాడారన్నారు. నేడు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయ్యే సరికి ప్రతిపక్ష పార్టీల నాయకులకు నోటిమాట పడిపోయిందన్నారు. సిఎం కెసిఆర్ ఏది చేసినా ముందుచూపుతో చేస్తారని, భవిష్యత్ తరాలకు అందించే విధంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ అపర భగీరథుడని, ఆసియాలోనే అతిపెద్ద ఎత్తిపోతల కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కిందన్నారు. మండుటెండల్లో సైతం చెరువులు, కుంటలు జలకళలాడుతున్నాయని, గత ప్రభుత్వంలో సాగునీరు, త్రాగునీరు లేక ప్రజలు ఎంతో అల్లాడినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సి హరిరామ్, ఎస్ఈ వేణు, గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ భూంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపిపి అమరావతి, జెడ్‌పిటిసి పంగ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్ రజితగౌడ్, బొగ్గుల చందు, ఏఎంసి వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ రోజారాధాకృష్ణశర్మ

# ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలి

### సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి పార్లమెంటు సభ్యత్వాని తొలిగించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం అయన మాటాడారు. ఢిల్లీ నడిబొడ్డులో తమను లైంగికంగా వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని పోరాటం నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. దేశం గౌరవ పడే విధంగా ఎన్నో పథకాలు సాధిస్తే వారిని బిజెపి ప్రభుత్వం చిన్న చూపు చూడడం సరికాదన్నారు. తమకు న్యాయం జరగకుంటే తమకు వచ్చిన గౌరవ పథకాలన్నీ గంగా నదిలో కలుపుతామని చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గంగా నదిలో కలపడం అంటే దేశ గౌరవ ప్రతిష్టలని గంగానదిలో కలపడం అవుతుందని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేసి పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలన్నారు. బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన సీఐటీయూ అధ్వర్యంలో ప్రజా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాలస్వామి, ఎల్లయ్య, కళావతి, పద్మ, మధు, భాస్కర్, రవికుమార్, చంద్రారెడ్డి, మహేష్, వెంకటయ్య, శిరీష, కిరణ్, అంజనేయులు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు



విగ్రహాన్ని పెకిలించి పక్కన పడేసిన దృశ్యం

## వెల్పుగొండలో గుప్తనిధుల తవ్వకాల కలకలం

**టేక్మాల్, జూన్ 7 , ప్రభాతవార్త:** టేక్మాల్ మండల పరిధిలోని వెల్పుగొండ గ్రామంలో గుప్తనిధుల తవ్వకాలు కలకలం రేపుతోంది. మారుమూల ప్రాంతం వెల్లుగొండ గ్రామంలో కాకతీయుల కాలంలో తుంబురీశ్వరుని దేవాలయంలో నిర్మించారు. ఆలయం చుట్టు కొండలు మధ్యలో కొలను 300 ఎకరాల విస్తీర్ణం ఉందని చెబుతున్నారు. కొలను మధ్యలో ఉన్న దేవతల గుట్టగా పూర్వికులు పిలిచేవారు. గుట్టపై దిగంబర బాహుబలి విగ్రహం నిలబడి ఉండేది దాన్ని కొందరుగుర్తు తెలియని దుండగులు పని గట్టుకొని గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపే క్రమంలో బాహుబలి విగ్రహాన్ని కింద పడేశారు. ఆ ప్రదేశంలో తాళ్లు, కట్టేలు ఇతర సామాగ్రి లభించాయి. కొందరు దుండగులు కొద్ది రోజులుగా రాత్రి వేళలో తవ్వకాలు అర్ధరాత్రి దిగంబర కాలబైరవ విగ్రహాన్ని అక్కడినుంచి తరలించడంతో పాటు అక్కడ ఉన్న గుప్తనిధులను సొంతం చేసుకోవాలన్నా గ్రామస్తులు అంటున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యకిపై ఆరోపణలు చేయగా ఆవ్యక్తి తాగుబోతుని గ్రామ సర్పంచ్ నారాయణ కొట్టిపారేశారని గ్రామస్తులు అంటున్నారు. ఇందులో గ్రామ ప్రజా ప్రతినిధులు హస్తం ఉందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ గుప్తనిధుల తవ్వకాలు జరిపింది వాస్తవమేనా లేదా పుకార్లు జరుగుతున్నాయా అనేది శాంతిభద్రతల శాఖ చూడాల్సిన అవసరం ఉంది.

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వం నిర్లక్ష్యం

### రామాయంపేట పట్టణం రెండు రోజుల బంద్‌కు పిలుపు

### బంద్ గోడపత్రిక విడుదల చేసిన జేఏసీ నాయకులు




దీక్ష శిబిరంలో బంద్ గోడపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

**రామాయంపేట, జూన్ 7, ప్రభాతవార్త ః** రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 73వ రోజుకు చేరుకున్నాయి. ఇంత కాలంగా చేస్తున్న దీక్షలకు స్పందించని స్థానిక అధికార పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జేఏసీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, యువజన సంఘాలు వాణిజ్య, వ్యాపార, వర్తక సంఘాల సహకారంతో ఈనెల 9, 10 తేదీలలో రెండు రోజుల పాటు రామాయంపేట పట్టణం 48 గంటల పాటు సంపూర్ణ బంద్‌కు జేఏసీ పిలుపునిచ్చింది. ఈరోజు దీక్షా శిబిరంలో జేఏసీ నాయకులు బంద్ గోడ పత్రికను విడుదల చేసి మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న రామాయంపేటను వెనువెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి, రామాయంపేటలో మౌలిక వసతులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈప్రాంత ప్రజల చిరకాల కోరికైనటువంటి రెవెన్యూ డివిజన్ సాధనకు జేఏసీ నాయకులు నిర్విరామ పోరాటం చేస్తున్నారని, కాబట్టి ప్రజలందరూ సహకరించి రెవెన్యూ డివిజన్ సాధనలో భాగస్వామ్యమై రెవెన్యూ డివిజన్ సాధించుకోవాలని వారు ప్రజలను కోరారు. రామాయంపేటకు పూర్వ వైభవం రావాలంటే తెలంగాణ ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. గతంలో కూడా 183 రోజులపాటు దీక్షలు చేస్తే మంత్రి హరీష్‌రావు మాయమాటలతో మభ్యపెట్టి దీక్షను భగ్నం చేసారని, ఈసారి మలిదశ ఉద్యమంలో బాగంగా ఎట్టి పరిస్థితులలో కూడా రెవెన్యూ డివిజన్ సాధించే వరకు వెనకడుగు వేసేది లేదన్నారు. జేఏసీ తలపెట్టిన బంద్‌కు పట్టణ ప్రజలు, వ్యాపారస్థులు, కార్మిక, కర్షక సంస్థలు మద్దతు తెలిపి బందులో పాల్గొని జయప్రదం చేసి డివిజన్ సాధనకై కృషి చేయాలని వారు కోరారు. జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## బిడిఎల్-భానుర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో.. వాట్సాప్ మెసేజ్‌తో సైబర్ నేరగాళ్ల మోసాలు

**పటాన్‌చెరువు, జూన్ 7, ప్రభాతవార్త:** పటాన్‌చెరువు నియోజకవర్గంలోని బిడిఎల్- భానుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెలిమెల గ్రామానికి చెందిన రాయిశెట్టి వేణుకు వాట్సాప్ అప్ లింకులో వీడియోలు చూస్తే డబ్బులు వస్తాయని చెప్పి, టెలిగ్రామ్ లింక్‌లో వేణు నెంబర్ యాడ్ చేసి 10 వీడియోలు చూస్తే కొంత డబ్బులు వస్తాయని నమ్మించి, ఆ తర్వాత యూ ఎస్ డాలరుపై ఇన్వెస్ట్ చేస్తే విడతల వారీగా పెట్టిన పెట్టుబడికి అధిక డబ్బు వస్తుందని నమ్మబలికి మోసానికి పాల్పడిన సైబర్ నేరగాళ్లు. అతని వద్ద నుండి విడతల వారిగా రూ.6,85,000లను ఆన్‌లైన్ ద్వారా తీసుకుని మోసానికి పాల్పడినట్లు తెలిపారు. మోసపోయానని తెలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు వేణు పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేశారు.


మాట్లాడుతున్న అత్తు

## మైనార్టీలకు ఆర్థిక సహాయం పథకం అమలుచేయాలి

**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్**

**సిద్దిపేట రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం కుల, చేతి వృత్తులకు అందించే ఆర్థిక సహాయ పథకం మైనార్టీలకూ అందజేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ, కులవృత్తులకు ఆర్థిక సహాయం కింద రూ.లక్ష అందజేస్తున్న ప్రభుత్వం మైనార్టీలకు ఎందుకు స్థానం కల్పించడం లేదన్నారు. మైనార్టీలలో వృత్తులు చేసుకుని జీవిస్తున్న పేద కుటుంబాలకు వెంటనే లక్ష రూపాయాల ఆర్థిక సహాయం అందించాలన్నారు. తంజీమ్ నాయకులు స్వలాభం కోసం ముస్లింలను పట్టించుకున్న పాపానపోలేద న్నారు. ముస్లిం కుటుంబాలలోని పేదలకు న్యాయం చేయలేని నాయకులు తంజీమ్‌లో ఉండే అర్హతలేదన్నారు. మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ హయాం లోనే జరిగిందని, తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. కులవృత్తుల తరహాలో మైనార్టీలకు ఆర్థిక సహాయం అందించకుంటే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. సమా వేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**


డిఇవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న టిపిటిఎఫ్ నేతలు

**సిద్దిపేట రూరల్, జూన్ 7,ప్రభాతవార్త :** విద్య సంవత్సరంలో ఎలాంటి ఒడిదొడుకులులేకుండా సరైనా విధానం అవలంభించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజేందర్‌రెడ్డి, మల్లికార్జున్ అన్నారు. ఈ మేరకు బుధవారం డీఈఓ కార్యాలయంలో సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామికి వినతి పత్రం అందజేశారు. అలాగే గత సంవత్సరంలో రద్దయిన బిల్లులకు మళ్లీ రీ టోకేన్ జారీ చేయాలని కోరుతూ డిటిఓ అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటుపై సరైన విధానం రూపొందించి ఈనెల 12కు ముందే అ ప్రక్రియ పూర్తిచేయా లన్నారు. రాగిజావ పంపిణీకి స్కూల్ పాయింట్‌లోనే మెటీరియల్, అలాగే ఉచిత పాఠ్యపుస్తకాలు త్వరగా అందించాలన్నారు. 317 జీవో అమలులో అధికారుల తప్పిదంవల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాల న్నారు. విద్యరంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి


బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జూన్ 7, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలను విద్యా ర్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక పాఠశాల ప్రధా నోపాధ్యాయులు అబ్దుల్లా షరీఫ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని రామంచ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చేసి విద్యార్థుల నమోదును నిర్వహించారు. రామంచ ప్రాథమిక పాఠశాల మన ఊరు మన బడి పథకంలో ఎంపికై లక్షలాది రూపాయాల అభివృద్ధి కార్య క్రమాలు జరిగాయన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశా లలు రూపుదిద్దుకున్నాయన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాఠశా లలో అహ్లాదకరంగా బోధన జరుగుతుందన్నారు. ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిం చారు. ప్రభుత్వం ప్రజల అకాంక్షలకు అనుగుణంగా అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సురేష్‌కుమార్, సునీత, అంగన్‌వాటీ టీచర్ లక్ష్మీ పాల్గొన్నారు.

## దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

**మిరుదొడ్డి, జూన్ 6, ప్రభాతవార్త :** ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాప కులు మామిడి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంజీరా యూత్ క్లబ్ సౌజన్యం తో ఈనెల 10,11వ తేదీలలో దుబ్బాక నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మంజీరా యూత్ క్లబ్ అధ్యక్షులు తోట వెంకటరెడ్డి, ప్రజాహిత ఫౌండేషన్ సభ్యులు స్వామి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ, టోర్నమెంట్‌లో గెలుపొందినవారికి నగదు బహుమ తులు అందజేయడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.14000, రెండో బహుమతి రూ. పదివేలు, మూడో బహుమతి రూ. 5 వేలు, నాల్గో బహుమతి రూ.2500 అందించడం జరుగుతుందన్నారు. దుబ్బాక నియో జకవర్గానికి చెందిన వారై ఉండాలన్నారు. రెండు రోజుల పాటు భోజన వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 9వతేదీ సాయంత్రం 6 గంటలవరకు టీంల ఎంట్రీలను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశం లో లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎంట్రీలను 9908693599, 9666354335, 9989385997లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

## కుల వృత్తులవారు రూ. లక్ష సహాయానికి దరఖాస్తు చేసుకోండి : ఎంపిడివో

**వర్గల్, జూన్ 7 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా కులవృత్తిదారులు, చేతివృత్తిదారులకు రూ.లక్ష సహాయం అందజేయడం జరుగుతుందని ఎంపిడిఓ మేరీ స్వర్ణకుమారి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని వెనుకబడిన బిసి కులవృత్తిదారులు, చేతి వృత్తిదారులు మీసేవ కేంద్రాలలో ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, వార్షిక ఆదాయం లక్షన్నరవరకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వరకు మించ కూడదన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఆర్థిక సహాయం అందిస్తా రని తెలిపారు. దరఖాస్తు తేదీ నుండి ఐదేళ్ళలో ఏ ప్రభుత్వ శాఖ ద్వారా అయినా లబ్ధిపొందినట్లయితే దీనికి అనర్హులని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధి దారులు కుల, ఆదాయ ధృవీకరణ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ ఫోటోలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## కుప్పానగర్‌లో దుర్గా మాతకు బోనాలు

**ఝరాసంగం, జూన్ 7,ప్రభాతవార్త:** మండలంలోని కుప్పానగర్ గ్రామం లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దుర్గామాత ఆలయంలో బుధవారం ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని అందంగా ముస్తాబు చేసి అమ్మవారికి రంగురంగు పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బోనాలను తీసుకెళుతున్న మహిళలు


# నెర్రలు పారిన నేలలో ఇక గోదావరి జలాలు

**ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్**


కెసిఆర్ ప్రసంగంతో కూడిన పుస్తకాన్ని ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్, జూన్ 7, ప్రభాతవార్త**

నిత్యం కరువు కోరల్లో విలవిల్లాడుతూ నెర్రలు బారిన నేలలతో చిక్కి శల్యమైన మెట్టప్రాంత రైతాం గానికి ఇకసాగునీటిని అందించబోతున్నట్లు హుస్నా బాద్ శాసనసభ్యులు వొడితెల సతీష్‌కుమార్ తీపి కబురు అందించారు. బుధవారం హుస్నాబాద్ నియోజక వర్గ కేంద్రంలోని శుభం గార్డెన్‌లో తెలం గాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన విజ యోత్సవాల సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమైఖ్యపాలనలో మెట్టప్రాంత రైతాంగం వలసలు వెళ్లడం, గల్ఫ్ దేశాలకు వెళ్లి దుర్భర జీవితాలు గడిపిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపేందుకు ప్రాజెక్టును పూర్తి చేసి త్వరలో ప్రారంభించబోతుందని చెప్పారు. హుస్నాబాద్ ప్రాంతంలో ప్రధానంగా మహా సము ద్రం గండిని పూడ్చి 14 గ్రామాలకు సాగునీటితో పాటు మంచినీటి వనరులను అందించబోతున్నట్లు సతీష్‌కుమార్ చెప్పారు. ముఖ్యమంత్రి హుస్నాబాద్ పర్యటన సందర్భంగా విచ్చేసి మహాసముద్రంగండి పనులను చేపట్టారని వెల్లడించారు. అలాగే 1.4 టిఎంసిల సామర్థ్యంగల గౌరవెల్లి ప్రాజెక్టును 10 టిఎంసిల సామర్థ్యానికి పెంచి రైతాంగానికి మేలు చేశారని కెసిఆర్‌ను కీర్తించారు. ఈ విషయంలో భూనిర్వాసితుల త్యాగాలను వెలకట్టలేనివని చెబుతూ వారికి న్యాయం చేసేందుకు ప్రత్యేకశ్రద్ధ తీసు కున్నామని వారికి ఎంత చేసినా తక్కువేనని సతీష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ ప్రచురించిన కోటిఎకరాల మాగాణి(కెసిఆర్ ప్రసంగంతో కూడినది) సభా వేదికపై ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ అర్బన్ జిల్లా జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధాకర్, సిద్దిపేట జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, అక్కన్నపేట జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కట్కూర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ శంఖుస్థాపనలు

## కట్కూర్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

**అక్కన్నపేట, జూన్ 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కట్కూర్ గ్రామం లో సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణంతోపాటు విశాల పరపతి సహకార సంఘం భవన నిర్మాణానికి బుధ వారం సహకార చైర్మన్ కొండూరి రవిందర్‌రావు సమక్షంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ భూమిపూజ నిర్వాహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పాడ్డాక చేపట్టిన అభివృద్ధితో పాటు నూతనంగా ఏర్పడిన మండలాలు అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతోంద న్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, సింగిల్ అధ్యక్షులు పంజా రాజయ్య, ఎంపిపి మాలోతు లక్ష్మీబీలూనాయక్, జడ్పీటిసి సభ్యురాలు భూక్య మంగశ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజనితిరుపతిరెడ్డి, ఎంపిటిసి సభ్యులు సుదోష్ణ, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పెసరు సాంబరాజు, ఎంపిడివో సత్యపాల్‌రెడ్డి, ఎంపివో కవికుమార్, కార్యదరి గుగులోతు మోహన్‌నాయక్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దండుపాళ్యం గ్రూపులుగా కళాశాల యాజమాన్యాలు


మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు రాజూనాయక్

**హుస్నాబాద్, జూన్ 7, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రాంతంలో దండుపాళ్యం బ్యాచ్‌లుగా మారిన కళాశాల యాజమాన్యాలు ఇష్టారీతిన కోట్లకు కోట్లు ప్రజల నుండి కొల్లగొడుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు గుగులోతు రాజూనాయక్ మండి పడ్డారు. ఇలాంటి దోచుకుతింటున్న కార్పొరేట్ తరహా కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాలోతు సత్యంనాయక్,భూక్య మోతీలాల్‌నాయక్,భూక్య క్రిష్ణనాయక్,భూక్య వీరన్న నాయక్ తదితరులున్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా అభివృద్ధి పనులు

**ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి**

**నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం లో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా నడుస్తున్నాయని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రూ. 30 లక్షలతో నిర్మిస్తున్న సిసిరోడ్ల పనులను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం హయాంలో నర్సాపూర్ మున్సిపాలిటీలో అన్నివార్డులలో సిసి రోడ్లను నిర్మించామని తెలిపారు. అంతేగాక మురికి కాలువల, డ్రైనేజీ పనులను సైతం చేసినట్లు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో సిసి రోడ్ల నిర్మాణాలకుగాను అధికంగా నిధులు కేటాయించి నిర్మించినట్లు తెలిపారు. అలాగే వివిధకులాల కమ్యూనిటిహాల్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మళ్లీ రాష్ట్రంలో అధికారం అప్పగించాలని మళ్లీ కెసిఆర్ మూడవసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, కౌన్సిలర్ లక్ష్మినాగేశ్,ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగావు,పిఆర్ ఏఈ స్వామిదాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు పంబళ్ళ బిక్షపతి, కౌన్సిలర్ గోడ రాజెందర్, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు హబీబ్‌ఖాన్, జ్ఞానేశ్వర్,జగదీశ్వర్, కృపాచారి, ఆంజనేయులుగౌడ్, తదితరు పాల్గొన్నారు.


సిసి రోడ్లనిర్మాణ పనులు ప్రారంబించిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు

## బిజెపి నాయకులు ముందస్తు అరెస్టు


పోలీసు ఠాణాలో భారతీయ జనతా పార్టీ నాయకులు

**కొల్చారం, జూన్ 7, ప్రభాతవార్త:** చిలిపిచెడ్ మండలంలోని అజ్జమరి గ్రామానికి బుధవారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, నర్సాపూర్ శాసన సభ్యులు మధన్‌రెడ్డిలు హాజరవుతున్నందున భారతీయ జనతా పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి కొల్చారం పోలీసు ఠాణాకు తరలించారు. కొల్చారం పోలీసుఠాణా ఆవరణలో బిజెపి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కొనసాగుతున్న తరుణంలో బిజెపి నాయకులను ముదస్తుగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వరి కొనుగోలు కేంద్రంలో రైతుల వద్ద ఉన్న వరి ధాన్యంను పూర్తిగా కొనుగోలు చేయకపోతుండటాన్ని మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకుపోయి రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు తమను ముందస్తుగా అరెస్టు అయ్యేలా పోలీసులను వాడుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే శాసన సభ ఎన్నికల్లో భిజెపి జండా ఎగరడం తధ్యమని మండల పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## విపిఎల్ సీజన్ టోర్నీని ప్రారంభించిన జడ్పీటిసి


వరిగుంతంలో క్రికెట్ టోర్నిని ప్రారంభిస్తున్న జడ్పీటిసి సంతోష్‌కుమార్

**కొల్చారం, జూన్ 7, ప్రభాతవార్త:** మండలంలోని వరిగుంతం గ్రామంలో బుధవారం విపిఎల్ సీజన్-3 వరిగుంతం (ప్రీమియర్ లీగ్)ను జడ్పీటిసి సభ్యులు మేఘమాల సంతోష్‌కుమార్ బ్యాటింగ్ చేసి టోర్నిని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మేఘమాల సంతోష్‌కుమార్ మాట్లాడుతూ టోర్న మెంట్‌లో 5 జట్లు తలపడుతున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి తో ఆటల్లో తలపడాలని సూచించారు. క్రీడలతో శారీరాక దారుఢ్యం పెరగడం తోపాటు క్రమశిక్షణ అలవడుతుందని, సోదర, స్నేహభావులు కల్గుతాయ న్నారు. క్రీడాకారులకు తన వంతు సహకారం రౌండ్ ద క్లాక్‌గా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు శేఖర్‌గౌడ్, వడ్ల శ్రీనివాస్, నబుముద్దీన్, సిద్ది రాములు, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఊరూర చెరువుల పండగను విజయవంతం చేయండి

**నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్**

**నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త:** దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న నిర్వహిస్తున్న ఊరూర చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ అన్నారు. బువవారం ఆయన రాయరావు చెరువు వద్ద ఊరూర పండగ ఏర్పాట్లను పరిశీలించారు. సభ నిర్వహణ స్టేజీని, బతుకమ్మ ఆట స్థలాన్ని పరిశీలించి పనులు వేగంగా చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊరూర చెరువు పండగ కార్యక్రమంలో భాగంగా ముందుగా నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయం నుంచి రాయారావు చెరువు వరకు బతుకమ్మ, బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. అంతేగాక కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊరూర చెరువుల పండగ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని వెంకట్ గోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


చెరువు పండగ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెంకట్‌గోపాల్ తదితరులు

# చెరువు పండగను విజయవంతం చేయండి

**రామాయంపేట మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్**

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 7, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా నిర్వహిస్తున్న మన చెరువు పండగను విజయవంతం చేయాలని రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం నాడు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పాటు మెప్మా రిసోర్స్ పర్సన్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గురువారం నాడు పట్టణంలోని మల్లె చెరువు కట్టపైన తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువుల పండగ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బోనాలు, బతుకమ్మలు, కోలాటాలు లాంటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు వెయ్యి మందికి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు ప్రతి ఒక్క అధికారి సహకరించి వారి వారివిధులు నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా స్థానికి మహిళా సంఘాల సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొనేటట్లు మెప్మా ఆర్‌పిలు చూడాలని వారందరికి మున్సిపల్ అధికారులు సహకరిస్తారన్నారు. కాగా ఈ కార్యక్రమానికి పట్టణానికి సంబంధించిన వివిధ చైర్మెన్‌లు, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, సిబ్బంది, మాజీ చైర్మెన్‌లు, కౌన్సిలర్‌లు, డైరెక్టర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ అన్నీ పార్టీల నాయకులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, మహిళలు, ప్రజలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, మున్సిపల్‌సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు రజిత, వసంత,మర్కు లావణ్య, రూప, స్వాతి, స్రవంతి, లావణ్య, విజయశ్రీ, కవిత, తరంగిణి, బాల్‌లక్ష్మి, పలువురు పాల్గొన్నారు.

## బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

**గజ్వేల్ టౌన్, జూన్ 7, ప్రభాతవార్త :** మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేసి పార్లమెంటు సభ్యత్వ నుంచి తొలగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కేవలిలు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా, ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి గ్రౌండు వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో కొంత కాలంగా రెజ్లర్లు లైంగికంగా వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌ను అరెస్టు చేసి న్యాయం చేయాలని పోరాటం నిర్వహిస్తున్నా కేంద్ర పెద్దలు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర పెద్దలు స్పందించి బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రం, రాణిప్రభావతి, శేఖర్, చంద్రశేఖర్, కిరణ్, బండ్ల స్వామి, రాజు, వెంకటచారి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ రంగాలలో పోటీలు


పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్ టౌన్, జూన్ 7, ప్రభాతవార్త:** గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాలలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని కాలేజీయేట్ కమిషనర్ అదేశాల మేరకు ప్రిన్సిపాల్, ప్రొ॥ పీవీ ఉమాశశి ఆధ్వర్యంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ శ్రీలత వివిధ రంగాలలో బుధవారం పోటీలు నిర్వ హించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజాహిత సంక్షేమ పథకాలు వ్యాసరచన పోటీలలో శృతి ప్రథమ బహుమతి, ఎం.చందన ద్వితీయ బహుమతి సాధించారు. తెలంగాణ సంస్కృతి, సంగీతం, సాంప్రదాయాలు, వంటలు అచారాలలో వక్తృత్వ పోటీలలో స్నేహంజలి ప్రథమ బహుమతి సాధించారు. పాటలు, డ్యాన్స్, డ్రాయింగ్ పోటీలలో శ్రీవాణి, ప్రవళిక, రేఖ, సంధ్యారాణి, మానసలు బహుమతులను గెలుచుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జయరాజు, డాక్టర్ అనిత, డాక్టర్ జ్యోతి, సుమలత, ఉమారాణి, సరోజన, నీలమ, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంకష్టహర చతుర్థి


వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్, జూన్ 7 (ప్రభాతవార్త):** సంకష్టహర చతుర్ధి సందర్భంగా ప్రజ్ఞా పూర్‌లోని వినాయకుని దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఎల్ల నారా యణ సంతోష దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి నెల సంకష్టహర చతుర్ధి సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వినాయకునికి పూజలు నిర్వహిస్తే సకల పాపాలు హరిస్తాయని అన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించిన ఎల్ల నారాయణ సంతోష దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కుర్రె లలిత సాయిరెడ్డి, నాందాసు ఇందిరా ప్రభు, మామిడి లక్ష్మి నర్సయ్యగౌడ్, ప్రొద్దుటూరి నరేందర్, మామిడి సురేష్‌గౌడ్, చంద రమేష్, చంద సందీప్, శేకరయ్య, రవీందర్, గోపిశెట్టి రవి, కుర్రె కరుణాకర్‌రెడ్డి, కిష్టాపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిది


దామరకుంటలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**మర్కుక్, జూన్ 7 (ప్రభాతవార్త):** బడి బయట పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత అందరిపై ఉందని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రమేష్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగం గా బుధవారం మండలంలోని దామరకుంట గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించే సామాజిక బాధ్యత మన అందరిపై అందన్నారు. ఐదేళ్ళు నిండిన పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపించాలని కోరారు. మన ఊరు బడిని బలోపేతం చేసుకోవాలని, ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. మన ఊరు మన బడి పథకం కింద ప్రభుత్వ బడుల్లో సకల వసతులు సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సుభాస్, వైవిఎస్.రెడ్డి, శ్రీశైలం, రేఖ, లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి దేవాలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట

**-స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

**ములుగు, జూన్ 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొట్యాల గ్రామం లో నూతనంగా నిర్మించిన మల్లికార్జునస్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక సర్పంచ్ గంగిశెట్టి గణేష్‌గుప్త ఆధ్వర్యంలో శ్రీ భవానంద ఆశ్రమ పురోహితులు అప్పాల సత్యనారాయణశర్మ, విఠల్‌శర్మ, రసరాజశర్మ, రాధాపతిశర్మ, భావానందశర్మల మంత్రోశ్చరణల మధ్య మల్లికార్జునస్వామి, లింగం, నంది విగ్రహాల ప్రతిష్ట నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎర్రోళ్ళ శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని సర్పంచ్ గణేష్‌గుప్త శాలువాలతో ఘనంగా సన్మానించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, యువజన నాయకుడు జుబేర్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మల్లికార్జునస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న పులిమామిడి రాజు

## ఆరూర్‌లో ఘనంగా ఉర్సే షరీఫ్ ఉత్సవాలు

**సదాశివపేట, జూన్ 7, ప్రభాతవార్త:** మండలంలోని ఆరూర్ గ్రామంలో ఉర్సే షరీఫ్ దర్గా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలకు బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు చేరుకుని దర్గాపై చాదర్‌ను కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దార్గకు చేరుకున్న రాజును ఉత్సవ కమిటి బాధ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. దర్గాను దర్శించుకోవడం ఆనందంగా ఉందని, కులమతాలకు అతీతంగా ఉత్సవాలకు ప్రజలు హాజరుకావడం సంతోషకరమన్నారు. పిఎంఆర్ యువసేన నాయకులు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## భజన సామాగ్రి అందజేసిన రాజు

**సదాశివపేట, జూన్ 7, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో రెవిన్యూ కాలనీలో గల శ్రీ వీరహనుమాన్ ఆలయాన్ని ఆలయ కమిటి ఆహ్వానం మేరకు బుధవారం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, పిఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా రాజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాజును ఆశీర్వచనాలు అందచేసి తీర్ధ ప్రసాదాలు అందించారు. ఆలయంలో ప్రతి మంగళ, శనివారాల్లో భక్తులు భజనలు చేస్తూ ఉంటారని, అయితే భజన సామాగ్రి అందుబాటులో లేని విషయాన్ని ఇటీవల ఆలయ కమిటి బాధ్యులు పులిమామిడి రాజు దృష్టి తేగా బుధవారం ఆలయ కమిటి బాధ్యులకు భజన సామాగ్రి (హార్మోనియం, తబలా, తాళాలు లాంటి పరికరాలు)లను రాజు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, పిఎంఆర్ యువసేన నాయకులు, ఆలయ కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా సంకష్టహార చతుర్ధి వేడుకలు

**-ఆలయాల్లో భక్తుల పూజలు, అన్నదానం**

**న్యాల్‌కల్,. జూన్ 7, ప్రభాతవార్త:** సంకష్టహార చతుర్ధి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని రేజింతల్, హద్నూర్, చీకూర్తి గ్రామాల్లోని స్వయంభువు శ్రీ సిద్ది శ్రీ వరసిద్ది వినాయక ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. సంకష్ట హార చతర్థి పర్వదినాన్ని పురష్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హద్నూర్ ఆలయంలో ఆలయ కమిటి బాధ్యులు భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించగా రేజింతల్ ఆలయంలో జహీరాబాద్, హైద్రాబాద్, కర్ణాటకలోని బీదర్, బెంగుళూరు పట్టాణాలకు చెందిన 19 మంది దాతల సహాకారంతో భక్తులకు ప్రసాద వితరణ, రాత్రికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రేజింతల్ ఆలయంలో ఆలయ అర్చకులు సిద్ది బుద్ది సమేత గణపతి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## అమ్మా బైలెల్లినాదో...!

**-కనుల పండువగా కోటమైసమ్మ తల్లీ ఊరేగింపు**

**నందిగామ జూన్7,ప్రభాతవార్త :**

నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో శ్రీ కోట మైసమ్మ దేవత విగ్రహ ఊరేగింపు కార్యక్రమం కనుల పండువగా సాగిం ది.అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఏర్పాటు చేశారు.మహిళలు బోనాలు ఎత్తుకొని ఆట పాటలతో భాజభజంత్రీల మధ్య,టపాకాయులు కాలుస్తూ ఊరేగింపు నిర్వ హించారు.రంగాపూర్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సాగిన ఈ ఊరేగింపు పురవీధుల గుండా సాగగా అడుగడుగునా భక్తజనం అమ్మవారికి స్వాగతం పలికారు.ఆద్యంతం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య డిజే సౌండ్ సిస్టం పాటలతో సాగడంతో భక్త జనం పులకించి పోయి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెల కొంది.గురువారం ఉదయం వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా కోటమైసమ్మ దేవతా విగ్రహ ప్రతిష్టాపన కా ర్యక్రమాన్ని శోభయమానంగా నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమా న్ని విజయవంతం చేయడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని నిర్వహకులు కోరారు.

## రాంపల్లిదాయరను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**కీసర,జూన్7,ప్రభాతవార్త:**

రాంపల్లిదాయర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రఇ చామకూర మల్లారెడ్డి అన్నారు. బుదవారం గ్రామంలో 50 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.నూతన గ్రామ పంచా యతీ భవనం,కమ్యూనిటి హాల్‌కి శంకుస్థాపన చేశారు.ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోనే గ్రామా లు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా నిధులు మంజూరు చేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ ఛైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి,వైస్ ఛైర్మన్ బెస్త వెంకటేష్, సర్పంచ్ గరుగుల ఆండాలు మల్లేష్,ఉపసర్పంచ్ గాడి రాము, మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి,వార్డు స భ్యులు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, చంద్రకళ, బాబు, విజయ,శ్యామల.మల్లిక పాల్గొన్నారు.

## 10నుండి ఎస్‌పీఎల్-2 క్రికెట్ టోర్నమెంట్

**షాబాద్, జూన్ 7, ప్రభాతవార్త :**

ఈనెల 10 నుండి షాబాద్‌లో ఎస్‌పీఎల్ 2 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం షాబాద్ మండల కేం ద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియాన్ని క్రికెట్ టోర్నమెంట్ నిర్వ హణ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఎస్‌పీఎల్ 2 క్రికెట్ టోర్నమెంట్ షాబాద్ మండల కేంద్రంలోన పీఆర్‌ఆర్ స్టేడియంలో ఈనెల 10 నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం షాబాద్ మండలంలోని అన్ని గ్రామాల నుండి క్రీడాకారులను తీసుకుని 8టీంలుగా విభ జించి ప్రతి టీం 7మ్యాచులుగా ఆడుతుందన్నారు. ఈయొక్క ఆటలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.50వే లు, రెండవ బహుమతి రూ.30వేలు, మూడవ బహుమతి రూ.20వేల, అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కూడా బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు క్రికెట్ టోర్న మెంట్ ఆర్గనైజర్ అభిరాంరెడ్డి ఫోన్ నెం.9089989999ను సంప్రదించాలన్నారు. ఈయొక్క కార్యక్రమంలో షాబాద్ మండల యువత అందరూ ఆటలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయ వంతం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల ఆశోక్, నాయకులు పొన్న వెంక టర్రెడ్డి, తమ్మలి రవీందర్, గౌరీశ్వర్, గౌతమ్, మల్లేష్, రవీందర్ నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, మల్లయ్య, శ్రీని వాస్‌రెడ్డి, భాస్కరచారి తదితరులు ఉన్నారు.

## బొడ్రాయికి మంత్రి మల్లారెడ్డి ప్రత్యేక పూజలు

**మేడ్చల్, జూన్ 7. ప్రభాతవార్త ః**

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయలో బుధవారం బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వేరు వేరుగా పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో గ్రామ ప్రజలు స్వామి వారిని దర్శిం చుకుని అభిషేకం జరిపారు. మహిళలు భోనాలతో ఊరేగింపు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ లక్ష్మీ శ్రీనివా స్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రభాకర్, సాయిగీతాశ్రమ వ్యవస్థాపకులు సాయికుమార్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిది హరివర్ధన్‌రెడ్డి, గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, పెం టయ్య, హేమంత్‌రెడ్డి, హంసరాణి కృష్ణగౌడ్, బాల్‌రాజ్, నాయకులు సంజీవగౌడ్, జనార్ధన్‌రెడ్డి, పిలిప్స్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

## ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం

**మెదక్ పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి**

**దుబ్బాక, జూన్ 7, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్‌ఇరిగేషన్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దే అని మెదక్ పార్లమెంటు సభ్యులు, జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా దుబ్బాక లో సాగునీటి శాఖ ఆధ్వర్యంలో బుధ వారం దుబ్బాక పట్టణంలో బాలాజీ ఫంక్షన్ హల్ లో నీటి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఒక్కప్పుడు కరువు కటాకలతో ఉన్న దుబ్బాక నేడు కళేశ్వరం నీటితో చెరువులు కుంటలు నీటితో నిండుకుని ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలో త్రాగు నీటి కోసం ప్రజలు ఎంతో అవస్తలు పడేవారు అని 100 పీట్లలోపు బోరు వేసిన గాని ఒక్క చుక్క నీటి బోట్టు పడేది కాదు అని సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి త్రాగు నీరు, కాళేశ్వరం పాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందు తుద న్నారు. కూడవెల్లి వాగు పరిసర ప్రాంత ప్రజలకు రైతుల ముఖంలో ఆనం దాలు నింపబడ్డాయి. దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్ నిర్మించడం దుబ్బాక ప్రజలా అదృష్టం అన్నారు. కల్వకుంట్ల చంద్ర శేకరుడే కాళేశ్వరుడై ప్రజలా కనీళ్ళు తుడుస్తు కరువును దూరం చేస్తున్నాడు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలాందరికి నీళ్ళ పండుగా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డిప్టారమెంట్ ఎస్ఈ బసవరాజు, మున్సిపల్ చైరపర్సన్ గన్నె వనిత రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ వివిధ మండలాల ప్రజా పరిషత్ అధ్యక్షులు కొత్త పుష్ప లత గాజ్జేల సాయిలు , జడ్పీటీసీలు, ఆత్మకమిటీ చైర్మన్ భాస్కరా చారి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ షేర్ల కౌలసం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగా బాల్‌రెడ్డి, డిసిసిబి ఉమ్మడి జిల్లా బాక్కి వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ, ఇర్రిగేషన్ డిఈ హరి కిషన్, ఎఈ జునాయిద్ ఆలీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడోల్ల దేవరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్స్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు దమ్మగౌని ప్రశాంత్ గౌడ్, నీటి పారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో రసాయన బస్తాలు లభ్యం

**ఆందోళన వ్యక్తం చేసిన గ్రామస్తులు**



రుద్రారం-చందంపేట శివారులోని పెద్ద చెరువులో వేసిన రసాయన బస్తాలు

**చిన్నశంకరంపేట,జూన్ 7, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం రుద్రారం, చందంపేట రెండు గ్రామాలను కలుపుకొని ఉన్న పెద్ద చెరువులో రసాయన బస్తాలు కనిపించడంతో రెండు గ్రామాల ప్రజలు ఉలిక్కి పడ్డారు. బుధవారం సాయంత్రం రైతులు పొలం వద్దకు వెళ్లి వస్తుండగా చెరువులో గుర్తుతెలియని బస్తాలు వారికి కనిపించాయి. దగ్గరికి వెళ్లి చూడగా దుర్వాసన రావడంతో రెండు గ్రామాల సర్పంచులు లక్ష్మణ్, శ్రీలతలకు సమాచారం అందించారు. వారు బస్తాల వద్దకు వెళ్లి పరిశీలించగా బస్తాలో ఇనుప వస్తువులు, రసాయనంతో కూడిన పౌడర్ అందులో ఉన్నాయి. గ్రామాల చుట్టూ ఉన్న పరిశ్రమ వారే ఉద్దేశపూర్వకంగా చెరువులో పడవేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. చెరువులో నీరు నిండుగా ఉంటే రసాయనం నీటిలో కలిసిపోయి పెను ప్రమాదం సంభవించేదని వారు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. గ్రామాలు ఉన్న చెరువుల వద్ద రసాయన బస్తాలను వేస్తే ఊరుకునేది లేదని, అవసరమైతే గ్రామాల చుట్టూ ఉన్న పరిశ్రమల వద్ద ఆందోళన చెపడుతామని ఇరు గ్రామాల సర్పంచులు హెచ్చరించారు.

## మిషన్ కాకతీయతో చెరువుల అభివృద్ధి

**ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**



సాగునీటి దినోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, జూన్ 7, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకొచ్చిన బృహత్తరమైన పథకం మిషన్ కాకతీయతో చెరువులకు జళకళ సంతరించుకుందని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలం కేంద్రంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సాగునీటి దినోత్సవంలో ఆయన హజరై మాట్లాడారు.గత పాలకుల హయాంలో ప్రజలు త్రాగు సాగునీటి కోసం నానా కష్టాలు పడ్డారని,పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ముఖ్యమంత్రి కెసిఆ ర్ ప్రత్యేక చోరువతో మిషన్ కాకతీయతో చెరువులు పూడిక తీసి సాగు నీటి కష్టాలు తీర్చారని,మిషన్ భగిరథలో ఇంటింటికి త్రాగు నీరందించి ప్రజల కష్టాలు తీర్చారని చెప్పుకోచ్చారు.చెరువులకు వచ్చె ప్రధాన కాలువలు పూడిక తీసి మరమ్మత్తులు చేయడంతో చెరువుల్లోకి నీరు చేరుతుందని దీంతో చెరువులు కుంటలు జళకళ సంతరించుకున్నాయని అన్నారు.నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.2931కోట్లను ఇప్పటి ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణా రెడ్డి,ఈఈ సునిత,డిఈ ఉషారా ణి,ఎంపిపి కృపేష్,జెడ్పిటిసి జంగమ్మ,మున్సిపల్ వైస్ చైర్మెన్ ఆకులయాదగి రి,వివిద గ్రామల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమాలపై అవగాహన

**బషీరాబాద్,జూన్ 07,ప్రభాతవార్త:**

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాడి క్రార్యక్రమాన్ని బుధవారం నాడు మండల పరిధిలోని బహదూర్ పూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా బహదూర్ పూర్ గ్రామం,బహదూర్ పూర్ తండాలలో ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గొట్టిగ ఖుర్దు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నర్సింగ్ రావు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి,ఎస్ఎంసి చైర్మన్ జనార్దన్ రెడ్డి,అంగన్వాడి టీచర్లు,గ్రామస్తులు ఉన్నారు.

## మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**కడ్తాల్,జూన్ 07 ప్రభాతవార్త :**

కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయంలో బుధవారం రంగారెడ్డి జిల్లా దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్ ఆలయ ఫౌండర్ ట్రస్టు ఛైర్మన్ సిరోలి పంతునాయక్, ఈఓ స్నేహలత ఆధ్వర్యంలో 70 రోజుల హుండి లెక్కింపులో భాగంగా రూ. 15,11,651 (పదిహేను లక్షల పదకొం డువేల ఆరు వందల యాభై ఒక రూపాయలు) ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు ఆర్‌పి భాస్కర్, వి. అరు ణ్, ముఖ్య అర్చక మాదారం యాదగిరి సిబ్బంది,జోడియానాయక్, క్రిష్ణ, చంద్రయ్య,రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, మహేష్, పత్యానా యక్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.



నిరుపేద వివాహానికి పుస్తె మెట్టెలు అందజేస్తున్న మడుపతి మహేష్ స్వామి

## నిరుపేద వివాహానికి పుస్తెమెట్టెలు అందజేత

**సదాశివపేట, జూన్ 7, ప్రభాతవార్త:** పట్టణంలోని చాకలి కేరికి చెందిన నిరుపేద ఆడపడుచు వివాహానికి మన సమాజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పుస్తెమెట్టెలు, పెళ్లి చీరలను అందచేసినట్లు మన సమాజం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మడుపతి మహేష్‌స్వామి పేర్కొన్నారు. మన సమాజం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 4 సంవత్సరాల్లో 54 నిరుపేద కుటుంబాల ఆడపడుచుల వివాహాలకు పెస్తె మెట్టెలు, వృద్దులకు దుప్పట్లు, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, రాత పస్తకాలు, పెన్నులు, ఇతర సామాగ్రి దీర్ఘకాలిక వ్యాధులతో అవస్థలు పడుతున్న వారికి మందులు కొనలేని దుస్థితిలో ఉన్న పేదలకు మందుల కొనుగోలుక ఆర్థిక సహాయం అందచేసినట్లు గుర్తు చేశారు. సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేయాలన్న సంకల్పంతో మన సమాజం ఫౌండేషన్ గ్రూపుతో సభ్యులను చేర్చుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మన సమాజం ఫౌండేషన్ సభ్యులు కరుణాకర్, చరణ్‌కుమార్, రవీందర్, హరీష్‌కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## 10న జాతీయ లోక్ అదాలత్ : జడ్జి సూరి కృష్ణ

**జహీరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** ఈ నెల 10వ తారీఖున జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జహీరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ సూరి కృష్ణ పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి పట్టణంలోని కోర్డు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కు నియోజకవర్గంలోని ఆయా పోలీసు ఠాణాల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీపూర్వకంగా వీలయ్యే కేసులను ఇరు వర్గాల సమ్మతితో పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రాజీ మార్గమే రాజ్యమార్గమని, కేసులతో కోర్టుల చుట్టూ తిరిగాడుతూ సమాయాన్ని, డబ్బులను వృదా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకుని కులాసాగా ఉండాలని న్యాయమూర్తి సూరి కృష్ణ సూచించారు.

## ఘనంగా గుబ్బడి సంగమేశ్వర ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న మహారాజులు, భక్తుల దృశ్యం

**ఝరాసంగం, జూన్ 7, ప్రభాతవార్త:** మండలంలోని కుప్పానగర్ గుబ్డఇ సంగమేశ్వర ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ పూజా కార్యక్రమాలకు మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవదూత గిరి మహారాజ్ (అప్పగారు), ధనసిరి ఆశ్రమ పీఠాధిపతి శివాచార్య మహారాజ్‌లు హాజరై ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమాల పీఠాధిపతులకు ఆలయ కమిటి బాధ్యులు శాలువాలతో సత్కరించి ఆశీర్వాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సుజాత, ఏపిఎం బాలకృష్ణ, గ్రామ ప్రముఖులు పండరీనాథ్, రాజ్‌కుమార్ స్వామి, లక్ష్మణ్, మల్లికార్జున్ పాటిల్, బగా అడివన్న, శ్రీశైలం పాటిల్, జగదీశ్వర్, రాసిరెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

**-మాజీ మంత్రి ప్రసాద్ కుమార్**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్ కుమార్

**మర్పల్లి జూన్ 7ప్రభాతవార్త :**

పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిందని కాంగ్రెస్ పార్టి మాజి మంత్రి జి ప్రసాద్‌కుమార్ అన్నారు .మర్పల్లి మండలంలోని రావులపల్లి గ్రామంలో బుధవారం నాడు హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు ప్రసాద్‌కుమార్ గ్రామానికి రాగానే అభిమానులు కార్యకర్తలు ఎద్దుల బండిపై ఊరేగింపుగా గ్రామంలోకి తిసుకు వచ్చారు .అనంతరం ఆయన గ్రామంలోని అన్ని కాలనీలు తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు బి ఆర్ ఎస్ పాలనలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కూడా సక్రమంగా సమకూర్చలేదని ఆయన అన్నారు గ్రామాల అభివృద్ది పూర్తిగా గాలికి వదిలరని అన్నరు ఇచ్చిన హామీలు సైతం గాలికి వదిలారని దళితులకు మూడు ఎకరాల భూమి ఉద్యోగాలు రుణమాఫి వంటి వాగ్దానాలను మరసిన బి ఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చె ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఆయంలో గ్రామాల అబివృద్ది ఒకేసారి రుణమాఫి పార్టీలకు అతితంగా పక్క గృహాల పంపిణి చేయడం జరిగిందన్నారు కాంగ్రెస్ పాలనలో వేసిన రోడ్లుతప్ప బిఆర్ఎస్ వేసిన రోడ్లు లేవన్నారు వచ్చె ఎన్నికల్లో రాష్ట్రంలో దేశంలో కాంగ్రెస్ పార్టీవిజయం సాధిస్తుందని ఆయన అన్నారు. కల్లిబొల్లి మాటలతో కాలం గడుపుతున్న బిఆర్ఎస్ బిజెపి పార్టీలకు ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని దేశాభివృద్ధితో పాటు రాష్ట్ర అభివృద్ధి జరుగాలంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలు దీవించాలని ఆయన అన్నారు ఈసమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణరెడ్డి మాజిమండల అధ్యక్షులు నర్సింలు శంకరయ్యగౌడ్ పార్టీ అధ్యక్షులు రవెందర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ రాచన్న రఫి లక్ష్మారెడ్డి సర్పంచ్ దేవమ్మ జిల్లా నాయకులు సంజీవరెడ్డి అబ్రం రాములు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దశాబ్ది సంబరం...నేటి సాగునీటి దినోత్సవం

**-ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**

**దౌల్తాబాద్, జూన్ 7 ( ప్రభాతవార్త )ః**

దశాబ్ధి సంబరం...నేటి సాగునీటి దినోత్సవమని కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు దగ్గర నిర్వహించిన కార్యక్రమంలో సాగునీటి రంగంలో సాధించిన రికార్డు స్థాయి ప్రగతిని ఎమ్మెల్యే వివరించారు. కొడంగల్ నియోజకవర్గంలో స్పష్టమైన తేడా కనిపించే విషయాల్లో సాగునీటి రంగం ప్రథమ స్థానంలో ఉందన్నారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త ప్రాజెక్టులు, సమగ్ర నీటి ప్రణాళికతో ఆయ కట్టు 119 శాతం పెరిగిందని చెప్పేందుకు దౌల్తాబాద్ పెద్ద చెరువు ఉదాహర ణ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ కృష్ణన్, ఎంపీపీ విజయ్ కుమార్, జడ్పీటీసీ కోట్ల మహిపాల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సుజాత, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త:** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రదాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మ ల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెములకు చెందిన పి.శృతికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూ రైన 46 వేల 500 రూపాయల చెక్కును బుధవారం మంత్రి బాధితురాలి బంధువుకు అంద జేసినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంటు బైనగారి నాగరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు కుర్రి ఆనంద్, బీఆర్ఎస్ నాయకుడు కోళ్ల యాదగిరి తది తరులు పాల్గొన్నారు.



చినిగేపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి

## చెరువులను పరిశీలించిన ఎంపిడిఓ

**-నేడు దశాబ్ది ఉత్సవాల చెరువు పండగ**

**న్యాల్‌కల్, జూన్ 7, ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే చెరువుల పండగను పురష్కరించుకుని చెరువు గట్టుపై సామూహిక భోజనాలు, సాంస్కృతిక హేళ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండటంతో బుధవారం మండలంలోని చినిగేపల్లి, హద్నూర్, డప్పూర్, గంగ్వార్ గ్రామాల్లోని చెరువులను ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధలతో కలిసి పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని, రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని చెరువుల పండగను విజయవంతం చేయాలని ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, రైతులకు సూచించారు.

## మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న మాణిక్‌రావు ధాక్రే



యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముల్గి మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ధాక్రే దృశ్యం

**జహీరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం అందించడంలో రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానంలో నిలిచిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముల్గి మల్లికార్జున్‌ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాణిక్‌రావు ధాక్రే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముల్గి మల్లికార్జున్ మాట్లాడుతూ మాజీ మంత్రి డాక్టర్ గీతారెడ్డి, జహీరాబాద్ ఎంపిపి గిరిధర్‌రెడ్డిల సహకారంతో సభ్యత్వాలు సజావుగా పూర్తిచేసినట్లు వివరించారు.

## నేడు జహీరాబాద్‌లో మంత్రి హరీష్‌రావు పర్యటన

**జహీరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త:** ఈ నెల 8వ తారీఖున రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖామాత్యులు తీన్నరు హరీష్‌రావు జహీరాబాద్‌లో పర్యటించనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఉదయం 10.30 గంటలకు రంజోల్‌లోని హిందూస్ స్కూల్‌ను ప్రారంభిస్తారన్నారు. 11 గంటలకు హోతి(కె)లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలిస్తారన్నారు. 11.30 గంటలకు పట్టణంలోని ఆర్యకటిక భవన నిర్మాణానికి శంకుస్థాపన, పట్టణంలో నిర్మిస్తున్న పద్మశాలి భవనంను పరిశీలిస్తారన్నారు. 12 గంటలకు పస్తాపూర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఉగ్గెల్లి యంజి రాములు యాదవ్ తమ్ముడి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొంటారని, ఎస్ కన్వెన్షన్‌లో జరిగే వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదిస్తారని అధికారులు వివరించారు.

## మిర్జాపూర్ బడిబాటలో ఎంఈఓ



బడిబాటలో పాల్గొన్న ఎంఈఓ మారుతి రాథోడ్ దృశ్యం

**న్యాల్‌కల్, జూన్ 7, ప్రభాతవార్త:** ఈ నెల 3వ తారీఖు నుంచి నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మిర్జాపూర్(ఎన్) గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మండల విద్యాధికారి మారుతి రాథోడ్ పాల్గొన్నారు. గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటి వెళ్లి చదువుతో కలిగే ప్రయోజనాలను, ప్రభుత్వ పాఠశాలల్లో అందచేస్తున్న సౌకర్యాలు, వసతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, భాస్కర్, రామకృష్ణ, లావణ్య, సంతోష తదితరులు పాల్గొన్నారు.

### బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి నిబంధనలు నడలించిన ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్

తెలుపుతూ ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియను నడలించింది. ఈ పెను విషాదం వల్ల ప్రభావితమైన కుటుంబాలకు ఆర్థిక ఉపశ మనం అందించడానికి కంపెనీ తమ క్లెయిమ్ పరిష్కారాన్ని సైతం వేగవంతం చేసింది. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద కవర్ చేయబడిన వారితో సహా అం దరికీ మరణం మరియు ఆరోగ్య క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ కేవలం మూడు ప్రాథమిక పత్రాల ఆధారంగా చేయబడుతుంది. క్లెయిమ్ సంబంధిత విచారణలకు సహాయం చేయడానికి కంపెనీ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను (1-860-266-7766) ఏర్పాటు చేసినట్లు ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కస్టమర్ సర్వీస్, ఆపరేషన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వై ప్రెసిడెంట్ శ్రీఅమిష్ వెల్లడించారు.

## ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

**చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి వేణుమాదవరావు**

**చేవెళ్ల, జూన్ 7, ప్రభాతవార్త :**

నూతనంగా ఓటు నెమాదు చేసుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు లు చేసుకోవాలని చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి వేణుమాద వరావు సూచించారు. బుదవారం చేవెళ్ల ఆర్డిఓ కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గం లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి వెణుమాదవరావు మాట్లాడుతూ ఓటు నమోదు చేసుకున్నవెంటనే బూత్ లేవెల్ అధికారులు ప్రతి గ్రామంలోని ఇంటింటికి సర్వే చేస్తారన్నారు. నూతనంగా ఓటు నమో దు చేసుకున్న ఓట్లను, తొలగించబడ్డ ఓట్లను కూడ అధికారులు విచారణ చేసి సరిచేస్తారన్నారు.నూతనంగా ఓటు హక్కుకోసం ఫాం-6ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓటు నమోదు కోసం ఏమైనా సందేహాలుంటే సంబందిత తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.కార్యక్రమంలో డిఎఓ మహ్మద్ తోఫిక్, శంకర్‌పల్లి తహసీల్దార్ నయిముద్దీన్,చేవెళ్ల న యబ్ తహసీల్దార్ రాజశేఖర్ పాల్గొన్నారు.

### నాసిరకం దగ్గు సిరప్‌లు లైసెన్సింగ్ విధానం కఠినతరం

గత నెలాఖరులో పంజాబ్‌లో తయారైన దగ్గు సిరప్‌లపై డబ్ల్యుహెచ్‌ఓ ఉత్పత్తి హెచ్చరిక (ప్రోడక్ట్ అలర్ట్)ను ఎలా అధికం చేసిందో అనేక వార్తలు వచ్చాయి. ఈ వాస్తవాన్ని సిడీఎస్‌సిఓ ధ్రువీకరించింది. దగ్గు సిరప్ లలో విషతుల్యమైన డైథిలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్, ఆమోదించలేని పరిమాణంలో ఉన్నట్లు వెల్లడించింది. గత సంవత్సరం అక్టోబర్‌లో భార తదేశంలోని మరొక రాష్ట్ర నుంచి వచ్చే దగ్గు సిరప్‌ల పై వైద్య హెచ్చరికను జారీ చేయడం పశ్చిమ ఆఫ్రికా దేశమైన గాంబియాలో పిల్లల మరణాలకు ఆ సిరప్ కారణమైన సంఘటనను గుర్తు చేసింది.